# కామెడీ కథ

**మా అన్నయ్య స్నేహితుడు ఈ ఊరు బదిలీ అయి వచ్చాడు. కూతురి పెళ్లికని పిలవడానికి వచ్చాడు. మరీ మరీ రమ్మన్నాడు. తప్పకుండా అటెండ్ అవాల్సిన పెళ్లి. ఈరోజే పెళ్లి.**

"మనం వెళ్లేటప్పటికి ముహూర్తం టైము దాటిపోతుంది. త్వరగా తెమలాలి వాణీ"

"ఇంకొక్క పది నిమిషాలు. వస్తున్నానండి"

ఈవిడ పది నిమిషాలు ఎన్ని నిమిషాలో? అయినా పెళ్లికన్నా తనకి అక్కడ భోగించబోయే విందు మీదే మక్కువ ఎక్కువ. అంతేకాదు, ఇవాళ వాణి చేతి ఉప్మా తినడం తప్పినందుకు ఆనందంగా ఉంది. తమ దాంపత్య జీవితంలో నాలుగు వంతులు ఉప్మా టిఫిన్లే పొద్దున్న పూట! ఏ రోజూ తొందరే. ఇద్దరం ఉద్యోగస్తులవడంతో ఈజీగా తయారయ్యే టిఫిన్ ఉప్మా. అందరూ చేసే ఉప్మా ఒక వంతయితే మా ఆవిడ చేసే ఉప్మా మరీ స్పెషల్. అది ఘనపదార్థంలాగా ఉండదు, ద్రవపదార్థంలాగా కూడా ఉండదు. మధ్యస్తంగా ఉంటుంది. ఈజీలీ డైజెస్టబుల్. ఇప్పటికి మా పెళ్లయి పదేళ్లు దాటినా మా ఆవిడ చేసే ఉప్మా అదే స్టయిలు! రంగు, రుచి, వాసనల్లో ఏమాత్రం ఇంప్రూవ్‌మెంట్ లేదు. అందుకు ఆవిడకు ఏదైనా బహుమానం ఇవ్వాల్సిందే. అందరూ అంటుంటారు నేను లావెక్కలేదని, పర్సనాలిటీ కాపాడుకుంటానని. వాళ్ల బొంద. అదంతా వాణి చేతి చలవేనని వాళ్లకు తెలీదు. అసలు మేం గనక స్లిమ్మింగ్ సెంటర్ పెట్టివుంటే చాలా పేరు, డబ్బు సంపాదించేవాళ్లం.

ఏ పదార్థం వండినా దేవుడికి నైవేద్యం పెట్టనిదే వడ్డించదు మా వాణి. బిజీగా వుండే ముక్కోటి దేవుళ్లకి యీజీగా అరిగిపోతుంది. ప్రేమగా గరిట పట్టుకుని వడ్డిస్తున్న వాణి కనబడదు నాకు. లాఠీ పట్టుకున్న పోలీసు గుర్తుకొస్తాడు. ఇద్దరిదీ ఒకే ఆఫీసవడం వల్ల టిఫిన్ తిని లంచికి యింటికి కలిసి వస్తాం. బయట ఎక్కడా తినే ఛాన్సు లేదు.

ఎంతకీ తెమలదేమిటి వాణి! కొంపదీసి ఉప్మా తయారుచేయటం లేదు కదా?

అసలు ఈ ఉప్మాని ఎవరు కనుక్కున్నారో?

పోనీ అది వాణి రోజూ ఎందుకు చేయాలి?

చేసినా తనకి ఎందుకు బలవంతంగా తినిపించాలి?

ఏ దేవుడైనా ఉప్మాని బాన్ చేస్తే బాగుంటుంది.

అమ్మయ్య.

వాణి తయారయి వచ్చేసింది.

ఎలాగైతేనేమి బయలుదేరి బస్సు పట్టుకుని పెళ్లి పందిరి చేరేసరికి పది గంటలు దాటింది. అయినా ఏ పెళ్లిలోనూ ఎవరికీ ఇంట్రెస్టు ఉండదు, అయిన వాళ్లకి తప్ప. మొక్కుబడిగా వెళ్లడం, ముడుపులు చెల్లించుకోవడం, వీడియోల్లోనూ ఫొటోల్లోనూ

## ఉప్మా

పడడం, తిండి తినడం, బయటపడడం. పెళ్లికి పిలిచినప్పుడున్న ఇంటరెస్టు రిసీవింగ్‌లో కనపడదు.

మంగళసూత్రధారణ అయింది.

అందరూ పొలోమని లేచారు. ఎవరంతట వాళ్లు త్వరగా గిఫ్ట్ యిచ్చేసి తిండికి వెళ్లేవాళ్లే. దాంతో క్యూ ఏర్పడింది.

మెల్లిగా నూతన వధూవరుల దగ్గరకి చేరుతున్నాం. ఇంతలో మా శ్రీమతి గిల్లింది. అబ్బా అని అరవబోయి దాని నవ్వు తెచ్చుకుని "ఏమిటి సంగతి?" అనడిగాను.

"పెళ్లికూతురు తెల్లగా ఉందేమిటండీ?" అనుమానం వ్యక్తం చేసింది వాణి.

"నీకు తెలీదా జల్దీ క్లీనింగ్ పౌడరు వాడిందేమో"

"ఏడ్చినట్టుంది మీ జోకు. అది ఫేస్ పౌడరు కాదు"

"అయితే ఫెయిర్ ఎన్ లవ్లీ వాడిందేమో"

"ఎన్ని ట్యూబులు వాడినా ఇంత రంగు వస్తుందా?"

"ఆ అమ్మాయిని మన పెళ్లయిన కొత్తల్లో చూశాము. నీకేం గుర్తు?"

"భలేవారే! ఒక రోజంతా మన ఇంట్లోనే వున్నారు కదా! ఆ అమ్మాయి నలుపు. నాకు బాగా గుర్తు"

"చాల్లేవే, నీ అనుమానాలు. అప్పుడా అమ్మాయి చిన్నపిల్ల. ఇన్ యూత్ ఎవ్రీ గూస్ లుక్స్ లైక్ ఎ స్వాన్. బాగా మేకప్ వాడిందేమో"

"చాల్లెండి మీ మాటలు. నాకు నవ్వు రావట్లేదు" మూతి మూడు వంకర్లు తిప్పింది వాణి. కరణం మల్లీశ్వరి గెలిచినప్పటి నుంచి మా ఆవిడ డామినేషన్ ఎక్కువయింది.

వెనక నుంచి జనాలు తోయడంతో ఏ ప్రమేయం లేకుండానే స్టేజి ఎక్కేసాం. అన్ని వీడియోలు, కెమెరాలు ఫోకస్ చేసే ఫీల్డులోకి వచ్చేశాం. అనుమానాలకి, ఎక్స్‌ప్రెషన్లకి సమయం కాదు. ముఖానికి నవ్వు పులుముకుని గిఫ్ట్ చదివించాం. దీవించాం. బయటపడ్డాం. మా ఆవిడ సణుగుతూనే వుంది. నాక్కూడా అనుమానం మొదలయింది. తెలిసిన వాళ్లెవరూ కనబడలేదు. అలాగే డైనింగ్ హాల్లోకి వచ్చాం. రద్దీ ఎక్కువగా వుంది. ఎంత సూటూ బూటూ వేసుకున్నా, ఎన్ని నగలు దిగేసుకున్నా, ఎంత మంచి పట్టుచీరలు కట్టుకున్నా, ఇంట్లో ఎన్ని పోజులు కొట్టినా, చచ్చే ఆకలి వేస్తున్నా -అడుక్కునే వాళ్లలాగా చిప్ప... ఐ మీన్ ప్లేటు పట్టుకుని క్యూలో వెళ్లాల్సిందే. ఈలోపల మారు వడ్డించుకునే వాళ్లు ఏ క్షణాన్నయినా ఎంగిలి కంచం మనకి తగిలిస్తారోనని ఎటెన్షన్‌లో ఉండాలి. బిజీ లైఫ్‌లో ఇవన్నీ ఆలోచించకూడదు మరి!

కడుపులో ఎలుకలు, పిల్లులు, కుక్కలు, ఎద్దులు నానారకాల జంతువులు పరిగెడుతున్నాయి. వండిన పదార్థాలు చూసి నోట్లో లాలాజలం ఊరుతోంది.

ఇంతలో అక్కడికి వచ్చాడు కన్యాదాత. (అయన గెటప్‌ని బట్టి అలా అనుకోవాలి).

ఎవరో ఆయనకి షేక్ హాండిచ్చి కంగ్రాట్స్ చెబుతున్నారు. నేనూ మా ఆవిడ గతుక్కుమన్నాం. అతను మా అన్నయ్య ఫ్రెండ్ కాదు.

"చూశారా! మనం వేరే పెళ్లికి వచ్చాం. వంద రూపాయలు పెట్టి కొన్న వెండి కుంకుమ భరిణ ఇచ్చేశాం. నా మాట వినిపించుకుంటేగా" వాణి దండకం మొదలెట్టింది.

తప్పు జరిగిపోయింది.

ఇక ఆర్గ్యుమెంట్లు అనవసరం.

నాకు ఓపిక లేదు. నేను కోపం తెచ్చుకోలేదు. కారణం వాణి నాకు రోజూ పెట్టే సాత్వికాహారం మహత్యం.

చాలా సాత్వికుణ్ణయ్యాను. సర్దిచెప్పే నెపంతో- "పోన్లే ఈ అమ్మాయికి ఎప్పుడో బాకీ వుండి వుంటాం. ఆ బాకీ తీర్చేశాం అనుకుందాం" అన్నాను.

"అంత తేలిగ్గా కొట్టి పారేస్తారేం? ఇద్దరి జీతాలు ఇల్లు కట్టిన అప్పులకే సరిపోక చస్తుంటే ఇదో దండగ" గయ్యమంది వాణి.

"వాణీ! ఎలాగూ ముడుపు చెల్లించాం కదా. భోంచేసి వెళ్లిపోదాం. ఎవడు చూడొచ్చాడు?"

"ఛీ... మీకసలు సిగ్గులేదూ? ఇలా జరిగినందుకు. వెళ్లిపోదాం. అయినా ఎడ్రస్ ఇదేనా అని?"

వాణి వాల్యూమ్ పెరిగిపోతోంది.

"సరే పద! వెళదాం బయటకి. ఇదేనే బాబూ ఎడ్రసు" నా వాల్యూమ్ తరిగిపోతోంది.

భోజనం ప్రాప్తం లేదు.

మెల్లగా ఇద్దరం బయటికి వచ్చాం.

ప్రక్కన మరో పెళ్లి.

ఒకే ఆవరణలో రెండు పెళ్లిళ్లు. అసలు మేం వెళ్లాల్సిన పెళ్లి అదే!

పొరపాటైపోయింది.

"ఏమాత్రం ఆలోచన లేకుండా పందిట్లోకి నడిపించుకు వచ్చారు. నేను చెబుతుంటే వినిపించుకుంటేగా" పాపం వాణికి కూడా ఆకలేస్తోందేమో కోపం ఎక్కువైపోతోంది.

"అవునే వాణి! యూ ఆర్ జీనియస్. (చచ్చినట్టు పొగడాలి మరి) నీ మాట విననందుకు సారీ! ఇదే మనం వెళ్లాల్సిన పెళ్లి. వెళదామా?" అడిగాను.

"ఛ! గిఫ్ట్ లేకుండా ఎలా వెళ్లాలి. నేను రాను" వాణి ఖండితంగా చెప్పేసింది.

"పోనీ జేబులో వంద రూపాయలున్నాయి. అవి ఇద్దామా?"

"ఛీ... ఛీ... చిన్న పిల్లకి పెట్టినట్టు రూపాయలు చేతిలో పెట్టడమేమిటి? పైగా వీడియోల్లో పడతామాయె"

"అక్కడ పడ్డాంగా కుంకుమభరిణ ఇస్తూ" అన్నాను.

"ఆ...ఆ... మహాపడ్డాం. ఆనక తీరిగ్గా వాళ్లు వీడియో చూస్తూ ఎవరీ శాల్తీలని జుట్టు పీక్కుంటారు. తిట్టుకుంటారు"

"ఏమీ తిట్టుకోరు. గిఫ్ట్ ఇచ్చాం కదా"

"నాకు గుర్తు చేయకండి. ఒళ్లు మండిపోతోంది"

"మరేం చేద్దాం?"

"వెళ్లి గిఫ్ట్ కవరు కొనుక్కుని రం.. నేను వెళ్లి పందిట్లో కూర్చుంటాను. తెల్సినవాళ్లు ..పడకపోరు"

"అలాగే, కానీ మనం చేసిన ని..కం ఎవరికీ చెప్పబోకు"

"సరేలెండి." నవ్వి బుద్ధిగా త..పింది మా ఆవిడ.



వాణి తలూపిందంటే ఇంటికి వెళ్లాక నాకు లెసన్ పీకుతుందన్నమాట. తప్పుతుందా మరి!

ఈసురోమని గిఫ్ట్ కవరు కొనడానికి వెళ్లాను.

దరిదాపుల్లో ఎక్కడా దుకాణాలు లేవు. వెతగ్గా వెతగ్గా ఒక దుకాణం కనిపించింది. గిఫ్ట్ కవరు కొని, అందులో 101 రూపాయలు పెట్టి పందిట్లోకి వచ్చేశాను.

వధువుకి కవరిచ్చి దీవించాం.

నిజంగా పిల్ల నల్లగా ఉంది. మా ఆవిడ మెమరీ పవర్‌ని మెచ్చుకోవాల్సిందే!

ఇంక భోజనాలు చేసి వెళ్లమన్నారు. ఇంకా నయం కొన్ని పెళ్లిళ్లలో భోంచేసి వెళ్లమనరు, ఇన్విటేషన్‌లో ఉంది కదాని. భోజనానికి బయలుదేరాం. పన్నెండున్నర అయింది.

అవును మరి తొమ్మిదిన్నకి ముహూర్తం. లంచ్ ఫాలోస్. అక్కడ పదార్థాలన్నీ అడుగుబొడుగుగా వున్నాయి. ఏదో ఇద్దరం తిన్నాం అంటే తిన్నాం అనిపించాం.

ఇద్దరికీ భోజనం నచ్చలేదు.

నా అవస్థని గమనిస్తూనే వుంది వాణి.

పాపం వాణి కూడా అలసిపోయింది.

నాకు విపరీతమైన జాలి పుట్టుకువచ్చింది. ఇవాళ ఎలాగైనా వాణిని హోటల్‌కి తీసుకెళ్లి మంచి టిఫిన్ పెట్టించాలి.

నా ఆలోచనలు ఇలా సాగుతున్నాయి.

వాణి ఏం ఆలోచిస్తోందో కానీ మెల్లగా నా దగ్గరకు చేరింది.

"మీకు ఆకలి తీరినట్టు లేదు. పోనీలెండి ఏం చేస్తాం. ఇవాళ మనకి ఇంతే ప్రాప్తం అనుకుందాము. ఇంటికి వెళ్లాక మీకు ఉప్మా చేసి పెడతానులెండి" అంది.

చేతిలో తింటున్న ఐస్ క్రీం కప్పు జారిపడిపోయింది. అదీ ప్రాప్తం లేదు.

"ఈ ఖర్చులు భర్తీ చేసుకోడానికి మనలాంటి మధ్య తరగతి వాళ్లకి మాటలా? ఒక వారం రోజులు రాత్రి కూడా టిఫిన్లే తిందాం" అఖిల భారత పొదుపు సంఘ అధ్యక్షురాలిగా వాణి తీర్మానం చేసింది.

నాకు తెలుసు ఆవిడ చేసే ఆ టిఫినేంటో!

హతోస్మి! ఈ జీవుడికి జీవితాంతం జీడిపప్పులేని జీళ్లపాకం లాంటి ఉప్మాయే గతి!

***(ఉప్మా వ్యతిరేకులకు ఈ కథ జాలితో అంకితం)***

ఇల్లిందల సుందరీకృష్ణ